ఈనాడు కుమురం భీం


మంగళవారం అక్టోబరు 8, 2024

పైసలిస్తేనే.. పట్టా చేతికి

● ఏళ్ల తరబడి తిరుగుతున్న బాధితులు

ఈనాడు, ఆసిఫాబాద్

భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు పైసలిస్తే తప్ప పనులు కావడం లేదు. భూ ప్రక్షాళన తర్వాత పట్టా భూముల్లో అనేక సమస్యలు తలెత్తగా.. బాధితులు ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇదే అదనుగా కొందరు అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారు. సక్రమంగా ఉన్న పత్రాలకు సైతం డబ్బులు డిమాండ్ చేసే దుస్థితి జిల్లాలో నెలకొనడం పాలన గాడితప్పిన తీరుకు నిదర్శనం.



ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చే దరఖాస్తుల్లో పూర్తిగా భూములకు సంబంధించినవే ఎక్కువ. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇక్కడ గిరిజనుల మధ్య భూ లావాదేవీలు జరుగుతుంటాయి. కొనుగోలు చేసిన గిరిజనులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే 'కే' ఫామ్, 'ఎల్' ఫామ్ తప్పనిసరి. వీటిని తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేస్తారు. ఇతను గిరిజనుడే, భూ వివరాలు సైతం పక్కాగా ఉన్నాయని ఆర్ఐ, ఎంఆర్ఓ సరిచూసి, 'కే' ఫామ్ జారీ చేస్తారు. అనంతరం కలెక్టర్ 'ఎల్' ఫామ్ ఇస్తారు. వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్-పట్టామార్పిడి జరుగుతుంది.

మచ్చుకు కొన్ని...

- ఆసిఫాబాద్ మండలం రహపల్లి పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. ఈ గ్రామంలో మూడు నెలల్లోనే 80 ఎకరాల వరకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.లక్షల్లో చేతులు మారగా, వీటి విలువ రూ.2 కోట్లకు పైమాటే అనే చర్చ జరుగుతోంది. రహపల్లి శివారు సర్వే నం.91, 37, 150, 27లతోపాటు రహపల్లి శివారు ఏజెన్సీ ప్రాంతమంతా అక్రమ పట్టాలు పుట్టుకొచ్చాయి. ఈ విషయమై అధికారులు సమగ్ర సర్వే చేస్తే మరిన్ని వివరాలు బయటకు వస్తాయి.
- ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ శివారు సర్వే నం.38, 24లలో మొత్తం 10 ఎకరాల భూమి రైతు పర్చకీ మోతారాం పేరు మీద ఉంది. వారసులు లేకపోవడం, అతను మరణించడంతో అక్రమార్కుల దృష్టి పడింది. ఓ నేత మద్దతుతో గ్రామానికి చెందిన ఒకరు ఈ భూమిని మొత్తం తన పేరు మీద పట్టా చేసుకున్నారు. ఈ అక్రమ పట్టాను రద్దు చేయాలని బాధితులు సోమవారం కలెక్టర్‌ను ఆశ్రయించారు.

చక్రం తిప్పుతున్న అధికారి..

అధికారులు నేరుగా రంగంలోకి దిగకుండా కింది స్థాయి సిబ్బందితో డబ్బుల వసూళ్ల తతంగాన్ని నడిపిస్తున్నారు. ఓ అధికారి తన మనుషులతో రైతులతో చరవాణిలో మాట్లాడిస్తూ బేరసారాలకు దిగుతున్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు వచ్చేలా చేయడం, అందుకు అధికారులందరూ సహకరించేలా పావులు కదపడం గమనార్హం.

ధరణి సమస్యలు పెండింగ్‌లోనే..

జిల్లా వ్యాప్తంగా దాదాపు 1300 రైతుల ధరణికి సంబంధించిన దరఖాస్తులు వివిధ స్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ వద్ద అనేక కారణాలతో ఇవి పరిష్కారానికి నోచుకోవడం లేదు.

రూ.50 వేలు అడుగుతున్నారు

ఆత్రం రాము, ఇప్పల్‌నవేగాం, ఆసిఫాబాద్



గ్రామ శివారులో సర్వే నం.19/2/ఆ/2 లో నాలుగెకరాల భూమిని మూడు నెలల కిందట కొన్నా. ఏజెన్సీ ప్రాంతం కావడంతో 'కే' ఫామ్ కోసం మూడు నెలల నుంచి తిరుగుతున్నా. రూ.50 వేలు ఇస్తేనే జారీ చేస్తామని ఓ అధికారి చెబుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

సహాయనిధి చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తన నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎంఆర్‌ఎఫ్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.13.69 లక్షల చెక్కులను అందజేశారు. ఎలాంటి ఇబ్బందికి తావులేకుండా చెక్కులు పంపిణీ చేపడుతున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

రైతేరాజు 9లో

కలల సౌధం?? చిక్కులు అనేకం

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్

ఇంటి నిర్మాణం ప్రతిఒక్కరి కల.. కొందరు యుక్త వయసులో.. మరికొందరు ఉద్యోగ విరమణ తరువాత కలల సౌధం నిర్మించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం బాగా పెరిగింది. కొత్త జిల్లా కేంద్రాలతోపాటు శివారు ప్రాంతాల్లో వీటిని నిర్మించుకుంటున్నారు. అయితే అనుభవ లేమి నిర్మాణదారులను కష్టాల పాల్జేస్తోంది. నిర్మాణదారులు కష్టాలు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

నస్పూర్‌లో నివసించే తిరుపతిరెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం తన కొడుకుల సలహా మేరకు పనిచేసిన ప్రాంతంలోనే ఇల్లు కట్టుకోవాలని అనుకున్నారు. భవిష్యత్తులో చిక్కులు వద్దనుకుని డీటీసీపీ లే అవుట్‌లో ఇంటి నిర్మాణానికి బిల్డర్‌ను సంప్రదించారు. నిర్మాణం సగానికిపైగా పూర్తయిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 80 శాతం డబ్బులు చెల్లించారు. చేయాల్సిన పనేమో 40 శాతం మేరకు ఉంది. ఇదేమని అడిగితే అప్పటికి, ఇప్పటికీ ధరలు పెరిగాయని, తానే అదనంగా ఖర్చు పెట్టి నష్టపోయానంటూ బిల్డర్ మాట మార్చాడు. అదనంగా మరింత సొమ్ము వెచ్చించి ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అంచనాలు బాగా పెరిగాయి.

యువ ఉద్యోగి కుమార్ ముందు చూపుతో బ్యాంకు రుణం తీసుకుని మంచిర్యాలలో ఇంటి నిర్మాణం చేపట్టారు. తానే కష్టపడి అన్నీ దగ్గరుండి చూసుకోవాలనుకుని తాపీ మేస్త్రీని మాట్లాడుకున్నారు. తెల్లకాగితంపై ఒప్పందం రాసుకున్నారు. ఎలివేషన్ పనితోపాటు, పిట్టగోడల నిర్మాణం, ఇతర పనుల వద్ద మేస్త్రీ మొరాయించడం మొదలు పెట్టాడు. ఇదేమని అడిగితే తనకు గిట్టుబాటు కాదని, అదనంగా సొమ్ము కావాలన్నాడు. మరొకరిని పెట్టుకుందామంటే తాపీ మేస్త్రీల సంఘం అంగీకరించదు. చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకుని పని పూర్తి చేయించాడు. అదనంగా రూ. 15 లక్షలు ఖర్చయింది. ఎలక్ట్రీషియన్ ఇబ్బడిముబ్బడిగా రకరకాల వైర్లు తెప్పించి, అవసరం ఉన్న దానికన్నా రెట్టింపు వినియోగించినట్లు కాకి లెక్కలు చెప్పాడు. అందరికీ సంఘాలు ఉన్నాయి. ఇల్లు కట్టుకునే వినియోగదారుడికి ఎలాంటి రక్షణ లేదని బాధితుడు వాపోయారు.

అనుభవలేమితో ఇబ్బందులు


కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు మిగతా వారి కన్నా కాస్త భిన్నంగా, కొత్తహంగులతో ఉండాలని అనుకోవడం సహజం. కానీ నిర్మాణ సమయంలో చిక్కులు ఎదురై అనేక మంది వివిధ విషయాల్లో ఫిర్యాదులు చేస్తుంటారు. వాటికి సరైన పరిష్కార మార్గాలు లభించడం లేదు. అధిక మొత్తం డబ్బులు వెచ్చించి అప్పులపాలు కావడం లాంటివి జరుగుతున్నాయి. జీవితంలో ఒకసారి మాత్రమే ఇల్లు కట్టుకునేవారు నూటికి 99 శాతం ఉంటారు. ఇల్లు కట్టాలని నిర్ణయించుకున్న వెంటనే దళారులో, తెలిసిన వారో రకరకాల సలహాలు ఇస్తారు. కొందరేమో ఎంతో కొంత డబ్బు ఆదా అవుతుందని సొంతంగా ఇంటిని నిర్మించుకుంటారు. ఇవన్నీ తలనొప్పి వ్యవహారాలు అనుకునే వారు గుత్తేదారు (బిల్డర్)కి అప్పగిస్తున్నారు. వారు ముందు చెప్పేది ఒకటి, తర్వాత చేసేది మరోటి ఉండటంతో పంచాయితీలు, పోలీసులను ఆశ్రయించడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

● ఇల్లు కడితే కష్టాలు.. కట్టిస్తే నష్టాలు..

● సూచనలు పాటిస్తేనే మేలు



మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు



నిపుణులేమంటున్నారంటే..

- ఇల్లు కట్టే ముందు అనుభవజ్ఞులను సంప్రదించాలి. ఇంజినీరింగ్ నిపుణుల సలహా మేరకు ముందుగానే నిర్మాణంలో ఏమేం ఇమిడి ఉంటాయనే విషయాన్ని తెలుసుకోవాలి. వాటి ప్రకారం ఒప్పంద పత్రాన్ని నోటరీ సమక్షంలో రాసుకోవాలి.
- కొందరు ఆయా సంఘాలు నిర్ణయించిన రేట్‌ను బుక్ రేటు అంటారు. ఇంకొందరు, స్లాబ్‌రేటు (చదరపు అడుగుల లెక్కన) ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ఎలివేషన్‌తో సహా ప్రతీ అంశాన్ని ముందుగానే నిర్ణయించుకుని ఆ ప్రకారం పని చేసేలా ఒప్పందం చేసుకోవాలి.
- విద్యుత్తు, ప్లంబింగ్, ఇంటీరియర్, తలుపులు, కిటికీల విషయంలో నిపుణుల సలహా మేరకు నాణ్యమైన వస్తువులను ప్రస్తావించాలి. ఎంత పనికి ఎంత మొత్తం వస్తువులు అవసరం అవుతాయో అంచనా వేయించుకుని ఒప్పంద పత్రంలో రాయించుకోవాలి. అప్పుడే కొంత మేరకు మోసాలు జరగకుండా ఉంటాయి.
- వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యతను పాటించే డీలర్లను ఎంపిక చేసుకోవాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు చేస్తే, దళారుల కమీషన్ల బాధ తప్పుతుంది.

అర్జీ స్వీకరణ.. పరిష్కారానికి చొరవ



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

ఆసిఫాబాద్ అర్బన్, కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, తదితర అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో.. 35 దరఖాస్తులు

కౌటాల మండలం మొగడ్‌దగడ్‌కు చెందిన దివ్యాంగుడు కొసంకర్ అనిల్ ఎంకాం పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నానని, రేషన్ డీలర్ లేదా ఇతర ఉపాధి కల్పించాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్ మండలం సార్సాల గ్రామానికి చెందిన పుల్ల రమేష్ రుణమాఫీ రావడంలేదని, వ్యవసాయ శాఖలో డేటా లేదని చెబుతున్నారని తెలుపగా. . ఏడీఏ మనోహర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దహెగాం మండలం బ్రాహ్మణ్‌చిచ్చాలకు చెందిన సుమారు 35 కుటుంబాలు.. ఏళ్లుగా మేకలగూడెంలో నివాసం ఉంటున్న ప్రభుత్వ స్థలానికి పట్టాలు ఇప్పించాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం బోరిగాంకు చెందిన షేక్ మున్నాబీ తనపేరిట ఉన్న రూ.1.60 లక్షల పంట రుణం మాఫీ కాలేదని, రుణమాఫీ అందేలా చూడాలని కోరుతూ విన్నవించారు. భూ సమస్యలపై 20, పింఛన్ల 2, రేషన్ కార్డు 1, ఇతర సమస్యలపై 12 దరఖాస్తులు వచ్చినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు.

ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్‌లోని బజార్‌వాడ, సందీప్‌నగర్, బ్రాహ్మణవాడకు చెందిన ప్రజలు బల్దియా పరిధిలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దహెగాం మండల



ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతూ.. వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన దహెగాం మండలం బ్రాహ్మణ్‌చిచ్చాల మేకలగూడెం నివాసులు



ఉపాధి కల్పించాలని కోరుతూ వచ్చిన దివ్యాంగుడు అనిల్‌తో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల

మొట్లగూడ గ్రామానికి చెందిన ఎనగందుల సంజీవ్ కంప్యూటర్ కోర్సు చేశానని తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ పెట్టుకున్నారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడకు చెందిన బొమ్మన రాజయ్య తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని విన్నవించారు. వాంకిడి మండలం పునగూడకు చెందిన ఉయిక గిర్జబాయి.. తన భర్త మరణించాడని, ఆయన పేరున ఉన్న భూమిని విరాసత్ చేయాలని దరఖాస్తు చేశారు. సరండికి చెందిన నారాయణ తన భూమిని పట్టా పాసుపుస్తకం ఇప్పించాలని వినతి సమర్పించారు. కెరమెరి మండలం కరంజివాడకు చెందిన రాథోడ్ శ్రీనివాస్ తన పేరిట ఉన్న ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమికి రైతు భరోసా ఇప్పించాలని కోరారు. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్ నవెగాంకు చెందిన గుమ్ముల విద్యాసాగర్ తనకు దివ్యాంగ పింఛను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకొన్నారు.


ఫిర్యాదులపై తక్షణ స్పందన

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించారు. చట్టప్రకారం ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు తీసుకొని వారి సమస్యలు ఆలకించారు. సంబంధిత పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్సైలకు ఫోన్ చేసి తక్షణ పరిష్కారం కోసం సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా వచ్చి పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. చట్టప్రకారం సమస్యల పరిష్కారం కోసం పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.



ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు

కాలువ నిండా పొదలు.. నీరెలా చేరు!



ఏటా వానకాలం ముందే చెరువుల సాగునీటి కాలువల్లోని పూడిక, ముళ్ల పొదలను తొలగించడం, లీకేజీలు ఉంటే మరమ్మతులు చేపట్టాలి. కొన్నిచోట్ల సాగునీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో.. పొలాలకు నీరందక ఆయకట్టుదారులు కష్టాలు పడుతున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని లోయర్‌డ్యాం, అప్పర్‌డ్యాం కాలువలు మరమ్మతులకు నోచుకోక భూములకు నీరందని పరిస్థితి. డ్యాముల్లో పుష్కలంగా నీరున్నా.. కాలువల్లో నీరుపారడం లేదు. అధికారులు స్పందించి సాగునీటి పథకాల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం



9న హైదరాబాద్‌కు డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024లో ఎంపికై సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్న అభ్యర్థులను ఈ నెల 9న హైదరాబాద్‌కు తరలించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలతో కలిసి టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లా నుంచి అభ్యర్థులను తీసుకెళ్లేందుకు ఏడు బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్, తాగునీరు, పండ్లు, ఉంచాలని సూచించారు. ఓ కానిస్టేబుల్‌ను నియమించాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 8న సాయంత్రం వరకు జిల్లా కేంద్రానికి చేరుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వారికి జిల్లా కేంద్రంలోని వివిధ వసతి గృహాల్లో బస ఏర్పాటు చేయాలని డీటీడీవో, డీఈవోలను ఆదేశించారు. 9న ఉదయం 4గంటలకు బస్సులు బయలుదేరాలని స్పష్టం చేశారు. ప్రయాణం మధ్యలో అల్పాహారం ఏర్పాటు చేయాలని సహకార శాఖాధికారికి సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సురక్షితంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి పత్రాలు తీసుకొన్న తర్వాత తిరిగి ఇంటికి చేరుకునేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు.



ఒలింపిక్ క్రీడా జ్యోతికి స్వాగతం పలికిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి రమాదేవి, తదితరులు

జిల్లా కేంద్రానికి చేరుకున్న సీఎం కప్ క్రీడాజ్యోతి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : సీఎం కప్ క్రీడోత్సవాల నేపథ్యంలో చేపట్టిన ఒలింపిక్ క్రీడా జ్యోతి ర్యాలీ సోమవారం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు చేరుకోగా.. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా యువజన క్రీడల అధికారిణి రమాదేవి, తదితర అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నవంబరులో నిర్వహించనున్న సీఎం కప్‌కు సంబంధించిన క్రీడా జ్యోతి ర్యాలీ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపుతుందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. సీఎం కప్ గచ్చిబౌలి స్పోర్ట్స్ అధికారి అలెగ్జాండర్, ర్యాలీ నోడల్ అధికారి కన్నం మధుబాబు ఈ ర్యాలీకి నేతృత్వం వహించారు. జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ మీనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీలు బాలేశ్వర్‌గౌడ్, మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ సభ్యులు సంతోష్, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

లక్మాపూర్‌లో పులి సంచారం?



కెరమెరి, న్యూస్‌టుడే : కెరమెరి మండలంలో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఆగస్టులో బోరిలాల్‌గూడ, జన్కాపూర్, పరందోలి, తదితర గ్రామాల సమీప అటవీ ప్రాంతాల్లో గ్రామస్థులకు బెబ్బులి కనిపించింది. ఆ తర్వాత జాడ లేదు. మళ్లీ సోమవారం లక్మాపూర్‌కు చెందిన రైతు మాలోత్ ఈశ్వర్ అడవి సమీపంలోని చేను పనులకు వెళ్లారు. ఆ క్రమంలో పులి తారసపడింది. భయంతో వెంటనే ఇంటికి వచ్చి స్థానికులు, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ గ్రామ సమీపంలో పులి సంచరించడం రెండోసారి కావడంతో గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పులి జాడ కోసం అడవుల్లో గాలిస్తున్నామని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో మజీరొద్దీన్ సూచించారు.

రాం..రాం.. సర్వే చేయలేం!

● నిరాకరిస్తున్న ఏఈవోలు..



ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

పంట వివరాలు పక్కాగా తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ సర్వేకు చర్యలు చేపట్టింది. ప్రత్యేక యాప్ ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) సర్వే చేయాలని ఆదేశించింది. ఇప్పటికే రుణమాఫీ, రైతు బీమా, బంధు.. ఇలా 49 రకాల పనులతో తీరిక లేకుండా ఉన్న తమకు సహాయకులు లేనిదే సర్వే చేయలేమని ఏఈవోలు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

ఆహార భద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాలతో కలిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, సాగు ప్రణాళిక, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, మార్కెటింగ్, తదితర వాటికి డిజిటల్ సర్వే కీలకమని కేంద్రం భావిస్తోంది. ఇందుకు వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే ఉద్దేశంతో డిజిటల్ అగ్రిమిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడం, రైతులకు ప్రయోజనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా సర్వేకు ఉపక్రమించింది. నిధులు సైతం వెచ్చిస్తోంది. అయితే ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా సిబ్బందిని సమకూర్చుకోవడం, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి సర్వే చేయిస్తున్నారని.. మన రాష్ట్రంలో మాత్రం పూర్తిగా తమపైనే వదిలేశారని ఏఈవోలు చెబుతున్నారు. గతంలో పైలట్ ప్రాజెక్టులో దహెగాం మండలంలో నిర్వహించిన సర్వేలో అయిదుగురు సభ్యులు ఒక గ్రామం పూర్తి చేయడానికి మూడు నెలలు పట్టిందని, ఒక ఏఈవో తమ క్లస్టర్ పరిధిలో రెగ్యులర్ విధులతో పాటు సర్వే చేయడం కష్టంగా ఉంటుందని వాపోతున్నారు.



కలెక్టరేట్ ఏవో మధుకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు..

- ఒక్కో క్లస్టర్‌కు ఒక ఏఈవో ఉండగా.. 5-12 వేల ఎకరాల వరకు సాగు భూములు ఉన్నాయి. చేన్లకు వెళ్లి 25మీటర్ల లోపు పరిధి నుంచి యాప్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. సర్వే నంబర్ల వారీగా ఏయే పంటలు ఎన్ని ఎకరాల్లో వేశారనే వివరాలు నమోదు చేయాలి. జిల్లాలో కొన్ని ఎత్తైన గుట్ట ప్రదేశాలు, వాగులు, వంకల అవతల, సరైన రోడ్లు లేని ప్రాంతాల్లోని భూములకు వెళ్లి సర్వే చేయడం ఇబ్బందిగా ఉంటుంది. బై నంబర్లు ఉన్న భూముల విషయంలో రెవెన్యూ సహకారం లేనిదే సర్వే కష్టంగా ఉంటుందని చెబుతున్నారు.
- జిల్లాలో సుమారు 48 గ్రామాల్లో చరవాణి సంకేతాలు లేవు. అలాంటి చోట సర్వే చేయడం కష్టం. ఆంధ్రప్రదేశ్‌లో 1000-1500 ఎకరాలకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించారని, తెలంగాణలోనూ తాత్కాలిక విధానంలో నియమిస్తే సర్వే చేసేందుకు సిద్ధమంటున్నారు. ఒక్కో సర్వే నంబర్ సర్వేకు కేంద్రం రూ.10 ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. ఇక్కడ తమపైనే పూర్తి భారం పడుతున్నట్లు వాపోతున్నారు. సర్వే చేయకుంటే విధులకు గైర్హాజరుగా నమోదు చేయాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఏఈవోలు మాత్రం రెగ్యులర్ విధులు మినహా సర్వేకు విముఖత చూపుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

? పట్టణంలోని బాలాజీనగర్ వాటర్ ట్యాంకు సమీపంలో పైప్‌లైన్ లీకేజీతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. **- అజయ్, బాలాజీనగర్**

✔ త్వరలోనే పైప్‌లైన్ మరమ్మతులు చేపడతాం.

- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? మండలంలోని అందవెల్లి పంచాయతీలోని ఆరెగూడలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టక అపరిశుభ్రత నెలకొంది. **- గణపతి, స్థానికుడు**

✔ బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం.

- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:

? మేషన్ కాలనీ వద్ద వీధి దీపాలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- రాహుల్, స్థానికుడు.**

✔ త్వరలోనే వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం

- తిరుపతి పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)

రహదారి చిత్తడిమయం



సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారి గుంతలు పడటంతో.. వారం కిందట జేసీబీ సహాయంతో పోలీసులు మట్టి పోయించారు. ఆ తర్వాత కురిసిన వర్షానికి రహదారి చిత్తడిగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బురద కారణంగా వాహనాలు జారుతుండటంతోపాటు కూరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే గుంతలు పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)**

కల్వర్టు.. మరమ్మతులకు దూరం



కాగజ్‌నగర్ మండలంలోని నాగంపేట-గన్నారం ప్రధాన రహదారి మధ్యలోని కల్వర్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. భారీ వర్షాల కారణంగా కల్వర్టు కొట్టుకుపోవడంతో సిమెంట్ పైపులు బయటపడ్డాయి. ఎవరైనా అప్రమత్తంగా లేకుండా వాహనం నడిపితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంటుంది. ఈ మార్గంలో నాగంపేట, గజ్జిగూడ, సీతానగర్, నామనగర్ తదితర గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు దెబ్బతినడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు సైతం చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం**

సంతలో స్థలం కరవు.. కార్యాలయాలకు పరుగు

మండల కేంద్రంలో ప్రతి సోమవారం వార సంత నిర్వహిస్తుంటారు. వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు, కొనుగోలుదారులు వస్తుంటారు. ఇక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో సమీపంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల ఆవరణల్లో తమ వాహనాలను నిలుపుతున్నారు. ప్రభుత్వ పనుల కోసం వచ్చే వారితో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. సంతలో వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, ఇతర సరకులు పెట్టుకుని విక్రయిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పటంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కౌటాల



కార్యాలయ ఆవరణలో నిలిపిన వాహనాలు

వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని బొగుడగూడ గ్రామానికి చెందిన అల్లూరి లక్ష్మి(44) అనే మహిళ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఏఎస్సై మోహన్ నాయక్ తెలిపారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తలైన అల్లూరి లింగయ్య-లక్ష్మి సోమవారం తమ పత్తి పంటకు పురుగుమందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. భర్త పిచికారీ చేసే క్రమంలో నీరు తేవడానికి వెళ్లిన లక్ష్మి వ్యవసాయ బావిలో కాలుజారి పడిపోయింది. ఎంతసేపటికి భార్య రాకపోవడంతో భర్త అక్కడికి వెళ్లి చూసేసరికి బావిలో పడి కనిపించింది. ఆమెను బయటికి తీసేసరికి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.



లక్ష్మి

వంకులం గ్రామంలో చోరీ

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే నానాజీ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నానాజీ తన భార్యతో కలిసి ఈ నెల 4న వైద్య చికిత్సల కోసం కాగజ్‌నగర్ ఆసుపత్రికి వెళ్లారు. ఈ నెల 6న రాత్రి ఇంటికి వచ్చారు. తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా వెనకాల తలుపు పగులగొట్టి కనిపించింది. అనుమానంతో ఇంట్లో పరిశీలించగా కట్టె బీరువా పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. అందులో భద్రపర్చిన ఒక్కొక్కటి తులమున్న ఆరు బంగారు ఉంగరాలు, 10 తులాల వెండి పట్టగొలుసులు, రెండు తులాల వెండి లక్ష్మి ప్రతిమ, అయిదు తులాల వెండి పళ్లెం మొత్తం 17 తులాల వెండి అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బీరువా పరిశీలిస్తున్న ఎస్సై డి.చంద్రశేఖర్

పంచాయతీ కార్మికుల ధర్నా

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించి, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో.. గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన హామీలను, కోర్టు ఆదేశించిన కనీసం వేతనం రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి శంకర్, ఉపాధ్యక్షులు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పాలస్తీనాపై మారణ హోమం మొదలై ఈ నెల 7వ తేదీ నాటికి ఏడాది అయిన సందర్భంగా సోమవారం వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద అమెరికా సామ్రాజ్యవాద దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాద ధోరణిని వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎండీ.చాంద్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.తిరుపతి, పట్టణ కమిటీ సభ్యులు శన్ను, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పేర్లు తొలగించాలని ఫిర్యాదు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఏజెన్సీ పంచాయతీ కోయవాగులో పలువురు స్థానికేతర గిరిజనులు ఓటరు జాబితాలో అక్రమంగా పేర్లు నమోదు చేసుకున్నారని ఆరోపిస్తూ.. భారాస నాయకుడు లెండుగురే శ్యాంరావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లకు ఫిర్యాదు చేశారు. స్థానికేతరులైన మడావి జైతు, భీంరావు, గిరిజబాయిలు నాయకుల అండదండలతో జాబితాలో పేర్లు నమోదు చేయించుకొని నివాస ధ్రువపత్రాలు పొందారని ఆరోపించారు.



వాకర్స్‌కు భాజపా సభ్యత్వ నమోదు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

భాజపా సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాజపా సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని, స్వచ్ఛందంగా అనేక మంది పార్టీ ప్రాథమిక సభ్యత్వాలు తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం వారికి పార్టీ సభ్యత్వ నమోదు అందజేశారు.

బెంగాలీ గ్రామాల్లో.. దుర్గామాత ఉత్సవాల సందడి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ మండలాల్లో స్థిరపడిన బెంగాలీల గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలు ఈ నెల 8-12 వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా మండపాల వద్ద ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కాందిశీకుల గ్రామాల్లో అయిదు రోజుల మాత్రమే ఉత్సవాలు నిర్వహించడం వీరి సంప్రదాయం.

జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాల్లో, చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్-1, 2 గ్రామాల్లో బెంగాలీలు స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీలోని విలేజి నం.5, 12, రవీంద్రనగర్-1, 2 గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేయిస్తున్నారు. జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నందున భక్తుల సంఖ్యకు తగ్గట్టుగా సదుపాయాలు సమకూర్చుతున్నారు. ఉత్సవాలకు హాజరు కానున్న భక్తజనం ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పవిత్ర సర్దార్, ప్రధాన కార్యదర్శి దర్వు సర్దార్, కోశాధికారి సురేష్ తెలిపారు.



విలేజి నం.12లో మండపం

బాధితురాలికి అండగా ఉంటాం: డీఎస్పీ

జైనూర్, న్యూస్‌టుడే: మండలంలో జరిగిన హత్యాచార యత్నం ఘటనలో గాయపడ్డ ఆదివాసీ మహిళకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్ భరోసానిచ్చారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న బాధితురాలిని సోమవారం ఆమె నివాసంలో కలిసి మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలతోపాటు పీడీ యాక్ట్ నమోదుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రూ.5 వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. సీఐ రమేశ్, ఎస్సై రామారావు వెంట ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణతోనే అడవుల మనుగడ

తిర్యాణి, న్యూస్‌టుడే: జాతీయ వన్యప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని.. సోమవారం తిర్యాణి, గిన్నెధరి రేంజ్‌ల పరిధిలోని అటవీ ఉద్యోగులు.. రేంజి కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం మీదుగా కుమురం భీం చౌక్ వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. తిర్యాణి, గిన్నెధరి రేంజర్లు శ్రీనివాస్, వెంకన్న మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణతోనే అడవుల మనుగడ ముడిపడి ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ రేంజర్ సావాద్, సెక్షన్ అధికారులు భీమ్లానాయక్, రాంసింగ్, శ్రీనివాస్, సందీప్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

ఇంటి వద్ద ప్రసవాలతో ఇబ్బందులు

వాంకిడి: గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్ సూచించారు. సోమవారం మండలంలోని ఇందాని ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద ప్రసవాలతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని, కాన్పుకు ముందు ఆసుపత్రుల్లో చేరాలని స్పష్టం చేశారు. శిబిరానికి వచ్చిన గర్భిణులతో పాటు ఇతరులు 58 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. జ్వరాలతో బాధపడుతున్న ముగ్గురి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలు.. పూజలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. పట్టణంలోని వాడవాడలా కొలువైన దుర్గామాతకు భక్తులు పూజలు చేస్తున్నారు. ఆయా మండపాల వద్ద దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణలు చేశారు. సోమవారం మహాచండీదేవీ రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

ఖైరిగూర ఓసీపీలో హోమం..

గోలేటి టౌన్‌షిప్: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూర ఓసీపీలో దుర్గామాత శరన్నరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. జీఎం ఎం.శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, ఖైరిగూర ఓసీపీ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, నళిని, గని మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఎస్వో రాజేశ్వరరావు దంపతులు.. హోమంలో కూర్చొన్నారు. అనంతరం జీఎం దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆలయ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఖైరిగూర ఓసీపీలో హోమం కాల్చుస్తున్న జీఎం శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి

మహా చండీదేవిగా.. దర్శనం

రెబ్బెన,: ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో సోమవారం అయిదో రోజు అమ్మవారు మహా చండీదేవి అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. వివిధ మండలాల నుంచి భక్తుల తరలివచ్చి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించారు.



బాలాజీనగర్ త్రినేత్ర శివాలయంలో..



వివేకానంద దుర్గా మండలిలో..



ఇందిరానగర్‌లోని దుర్గామాత ఆలయంలో.

ఉత్తర తెలంగాణను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతా

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తర తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డా. వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయంలో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్‌తో ఒక యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల్లో ఈ యాప్‌ను విడుదల చేస్తామన్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సొంత నిధులతో ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. ఉద్యోగులు పాత పింఛను విధానాన్ని సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గెస్టు, కాంట్రాక్టు టీచర్లు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం పోరాడతానన్నారు.



మాట్లాడుతున్న వి.నరేందర్‌రెడ్డి

ఆడపడుచుల ఆటపాటలకు అన్ని ఏర్పాట్లు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: భాగంగా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ పండగను నిర్వహిస్తామని, ఆడపడుచుల ఆటపాటలకు ఎస్పీఎం క్రీడా మైదానంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హిందూ ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టంతోపాటు ఇతర సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు, పురపాలిక అధికారులు, హిందూ ఉత్సవ సమితి సమన్వయంతో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ నెల 10న సద్దుల బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నట్లు వివరించారు. మైదానానికి వచ్చిన ప్రతి బతుకమ్మకు కూపన్లు అందజేస్తామని, ఉత్తమ బతుకమ్మలను గుర్తించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. నాయకులు తుమ్మ రమేశ్, సిందం శ్రీనివాస్, తాటి శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సీపీ రాజ్‌కుమార్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీఎం మైదానంలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హిందూ ఉత్సవ సమితి నాయకులు

రెండు ప్రాంగణాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు

గోలేటి టౌన్‌షిప్: బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం, మాదారంలోని రామాలయం ప్రాంగణంలో ఈ నెల 10న నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని జీఎం ఎం.శ్రీనివాస్ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఉత్సవాలు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. రెండు ప్రాంగణాలకు తీసుకొచ్చిన బతుకమ్మలలో అందంగా అలంకరించిన వాటికి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. వేదిక వద్దకు రాత్రి 9 గంటలలోపు వచ్చిన వాటికే పోటీకి అనుమతిస్తారని చెప్పారు. వేడుకల ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించే రెండు ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు.

జిల్లా మేడి మోతీరాంపై ఫిర్యాదు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పోలీసుల సమక్షంలో ఉపాధ్యాయులను నిందిస్తూ మాట్లాడిన జిల్లా మేడి కుర్మెంగ మోతీరాం ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు అన్నారు. ఆయనపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఈ సమస్య పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు, జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, కులపెద్దలు జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సమావేశం కాగా మోతీరాం తన విధానాన్ని మార్చుకొనేందుకు సిద్ధం కాలేదన్నారు. దీంతో ఆయన జిల్లా మేడి పదవిలో కొనసాగించే అర్హత కోల్పోయాడని ప్రకటించారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొట్నాక్ విజయ్‌కుమార్, కె.గణపతి సెక్టార్ మేడి, ఉపాధ్యాయులు కె.ప్రవీణ్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా.. సోమవారం పట్టణంలో పథ సంచలన్, ఉత్సవ మార్చ్(ర్యాలీ) నిర్వహించారు. సుప్రభాత్ పాఠశాల నుంచి 99 మంది యూనిఫాంలో, యూనిఫాం లేకుండా 143 మంది పాల్గొన్నారు. పలు వీధుల గుండా సాగుతూ ఎస్పీఎం క్రీడా మైదానం వరకు ర్యాలీ సాగింది. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ సామల కిరణ్ మాట్లాడుతూ.. విజయదశమి ఉత్సవం, హిందూ సంస్కృతి, ఐకమత్యం, సజ్జన సాంగత్య, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువలు తదితర అంశాలపై వివరించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, భాజపా జిల్లా అధ్యక్షులు డా.కొత్తపల్లి శ్రీనివాస్, బీఎంఎస్ నాయకులు కల్లోల భట్టాచార్య, స్వయం సేవక్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల ర్యాలీ

భీం వర్ధంతి సభ గోడప్రతుల విడుదల

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కుమురం భీం అనుచరుడు, ఉద్యమకారుడు కుంరం సూరు వర్ధంతి సభ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి విడుదల చేశారు. గిరిజన సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజనీతిశాస్త్రంలో అధ్యాపకుడికి డాక్టరేట్

తిర్యాణి, న్యూస్‌టుడే: తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడి పనిచేస్తున్న మురావత్ మంజీ.. అదే విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహాచారి డాక్టరేట్ ప్రకటించినట్లు, యూనివర్సిటీ నోట్ పంపినట్లు ఆయన తెలిపారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్ ఇన్ ఆసిఫాబాద్ డివిజన్ అనే అంశంపై ఆచార్య జి.వీరన్న పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేశానని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కోనప్ప జన్మదిన వేడుకలు

బెజ్జూరు, న్యూస్‌టుడే : సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదిన వేడుకలను కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కోశారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బషరత్ ఖాన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, వెంకన్న, సాయి, మాజీ సర్పంచులు శేఖర్, శంకర్, ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు సకారాం, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు అమీరుద్దీన్, సతీష్, మహేష్, అనిల్, శౌకత్‌అలీ, ఇస్తారి, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్ అర్బన్: నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ.. డీఆర్‌డీఏ పీడీ దత్తారావ్‌కు జిల్లాలోని ఐకేపీ వీవోలు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ.. దసరా పండగ నేపథ్యంలో వేతనాలు లేక వీవోలు పస్తులుండే పరిస్థితి ఉందన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి, మండల అధ్యక్షుడు బుద్ధు, ప్రతినిధులు కల్యాణి, పద్మ, ఫర్జానా, శారద పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు దూరం.. తప్పని భారం

★ ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న మండలవాసులు..

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే :

అత్యవసర సమయంలో రోగులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడంతోపాటు, పేదలకు రవాణా పరంగా భారం కాకుండా 108 వాహనం సేవలందిస్తోంది. ఆపద్బంధువుగా పిలవబడే ఈ వాహనం చింతలమానెపల్లి మండలంలో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆపదలో సమాచారమిస్తే.. కౌటాల, సిర్పూర్, కాగజ్‌నగర్, బెజ్జూర్ ప్రాంతాల నుంచి మండలానికి దాదాపు 30-50 కి.మీ. ప్రయాణించేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అంతేకాకుండా ఆయా మండలాలకే పరిమితం అవుతుండటంతో.. సేవలు పూర్తిస్థాయిలో దొరకడం లేదు. ఫలితంగా ప్రమాదం లేదా గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ కేవలం పగటి పూట మాత్రమే వైద్య సేవలందిస్తారు. సాయంత్రం, రాత్రిసమయాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే చికిత్స నిమిత్తం కౌటాల, సిర్పూర్, కాగజ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లాల్సిందే. అత్యవసర సేవలకు ఇతర మండలాల నుంచి వాహనాలను వినియోగిస్తున్నా సేవలు అంతంతమాత్రంగానే ఉండటంతో.. 108 వాహన సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండలవాసులు వాపోతున్నారు.



రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇటీవలి కొన్ని ఘటనలు పరిశీలిస్తే..

★ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గర్భిణి దేశ్‌ముఖ్ లక్ష్మికి గత నెలలో పురిటినొప్పులు వచ్చాయి. దారి సౌకర్యం సరిగ్గా లేక 108 వాహనం గ్రామానికి రావాలంటే 50 కిలోమీటర్ల వరకు దాదాపు రెండు గంటల సమయం పడుతుందని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో మహారాష్ట్రలోని అహేరికి తీసుకెళ్లారు.

★ మండలంలోని బురుకుగూడ గ్రామానికి చెందిన గర్భిణి రమాదేవి సైతం గత నెలలోనే ప్రసవ సమయంలో 108 వాహనానికి సమాచారమిచ్చారు. రావడానికి ఆలస్యం అవుతుందని సిబ్బంది తెలపడంతో.. చేసేదేమి లేక మహారాష్ట్రకు వెళ్లారు.

★ బాబాసాగర్ గ్రామానికి చెందిన ఎడ్ల రవి వారం రోజులు కిందట అస్వస్థతకు గురయ్యారు. 108 వాహనం అందుబాటులో లేనికారణంగా ఆటోలో కాగజ్‌నగర్ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు.

● విషయంపై సంబంధిత అధికారులకు 'న్యూస్‌టుడే' సంప్రదిస్తే.. అందుబాటులోకి రాలేదు.

మద్దతు ధర దక్కాలంటే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

పంటలు చేతికొస్తున్నాయి. క్రయవిక్రయాలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. నాణ్యతను పాటిస్తే మద్దతు ధరను పొందే అవకాశం ఉంది. ధర నిర్ణయంలో తేమకు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మొదలైన నేపథ్యంలో నాణ్యత, మద్దతు ధరలు పంట విక్రయాలు, కోతలు తదితర వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్కెట్ ఏడీ గజానంద్ సూచనలు చేశారు.



పత్తిలో తేమ నిర్ధారణ ఇలా

కోతలో జాగ్రత్తలు

గిట్టుబాటు ధర రావాలంటే రైతులు కోత దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటే పంట నాణ్యతగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావున పత్తి ఎండపూట ఏరాలి. పత్తిని కుప్పగా వేయడం వల్ల తేమ అందులోనే ఉండి పత్తి చెడిపోవడమే కాకుండా ధర కూడా రాదు. పత్తి ఏరిన తర్వాత ఆరబెట్టి తీసుకొస్తే తేమ తగ్గుతుంది. వరి పైరు కోసిన తరువాత తేమ తగ్గేందుకు పొలంలో కోసిన చోటనే ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకూడదు. క్రమక్రమంగా తగ్గాలి. సాధారణమైన ఎండలో పొడిగాలి సన్నగా వస్తున్నప్పుడు ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ శాతం 14-16 శాతం ఉండేట్లు చేయడం వల్ల ధాన్యం ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు. మొక్కజొన్న, సోయా, ఇతర పప్పుదినుసుల పంటలు కోతల తరువాత రెండు, మూడు రోజులు ఆరబెట్టి తరువాత నూర్పిడి చేయాలి. తిరిగి రెండు రోజులు గింజలను ఆరబెడితే తేమ పూర్తిగా తగ్గి గిట్టుబాటు ధర వస్తుంది.

రైతేరాజు

నాణ్యత నిర్ధారణ ఇలా..

పత్తిలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 వస్తుంది. ప్రతి ఒక శాతానికి కిలో ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12 శాతం తేమ వరకే కొనుగోలు చేస్తారు.

- సోయాబీన్‌లో 12 శాతం తేమ లోపు ఉండాలి. చెత్తాచెదారం, పగిలిన గింజలు మూడు శాతం లోపు ఉండాలి.
- మొక్కజొన్నలో 12 శాతం తేమ లోపు ఉండాలి. వేరే పంట పదార్థాలు 0.25-0.75 శాతం వరకు ఉండొచ్చు. దెబ్బతిన్న గింజలు ఒక శాతం లోపు ఉంటే ఫరవాలేదు.
- పప్పుదినుసుల్లో 12 శాతం, ధాన్యంలో 14 శాతం తేమ లోపు ఉండాలి. అంతకంటే తేమ ఎక్కువగా ధరలో కోత విధిస్తారు. ప్రతి పంటలో తేమను నిర్ధారించే పరికరాలు ఉంటాయి. వాటితో తేమ శాతాన్ని పరిశీలించి ధరను నిర్ణయిస్తారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు : 99085 56659

పత్తి పంటలో కాయకుళ్లు ఆశించింది. నివారణ సూచించండి? - చంద్రశేఖర్, బేల

ఫ్లక్సాపైరక్సాడ్+ పైరక్లోస్ట్రోబిన్ 0.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కందిలో ఆకులు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. పంటను కాపాడుకోవడం ఎలా? - నాగోరావు, గుడిహత్నూర్

19.19.19 పది గ్రాములు+ఫార్ములా 4 అయిదు గ్రాములు లీటరు కలిపి పిచికారీ చేయాలి.

టమాటాను పిన్‌వార్మ్ ఆశించింది. నివారణ సూచించండి? - రవీందర్, మన్నూర్, గుడిహత్నూర్

ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఇండాక్సికార్బ్ 1.75 మి.లీ లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు మందులను మార్చి, మార్చి పిచికారీ చేయాలి.

తక్కువ విస్తీర్ణంలో.. విభిన్న రకాల సాగు

ఆదర్శం

ఏకొద్దిగా చేను ఉన్నా వరి లేదా పత్తి సాగు చేస్తున్న ప్రస్తుత తరుణంలో దండేపల్లికి చెందిన ఎనగందుల భూమయ్య ఉన్న తక్కువ విస్తీర్ణంలో విభిన్న రకాల కూరగాయలు, పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనకు 26 గుంటల పొలం ఉండగా ఇందులో వరి సాగు చేస్తున్నారు. ఇంటి సమీపంలో ఉన్న 14 గుంటల్లో ఉన్న పెరడులో కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో బెండ, వంకాయ, అల్సంత తదితర కూరగాయలు సాగు చేస్తారు. వీటిని స్థానిక సంతకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.. చాలా మంది ఇంటికే వచ్చి తీసుకెళ్తుంటారు. పంట చేతికి రాగానే తీసేసి పూలను సాగు చేస్తారు.. గతేడాది సీతమ్మ జడలు, బంతి తదితర పూలు సాగు చేయగా ఈసారి సీతమ్మ జడలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళి తదితర పండగలకు పూలు చేతికొస్తాయి. దీంతో ఆదాయం సమకూరుతుంది. సీజన్ పూర్తి కాగానే తిరిగి కూరగాయలు సాగు చేస్తారు. ఇలా వేసవి పూర్తయ్యే వరకు రెండు సార్లు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో వరితో పాటు పూలు, కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.



పూలసాగు చేస్తున్న భూమయ్య

- న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం

నాణ్యమైన నారు కావాలంటే..

మీకు తెలుసా?

కూరగాయలను కాలంతో సంబంధం లేకుండా సాగు చేస్తుంటారు. యాజమాన్య పద్ధతులు పాటించి కూరగాయల నారు పెంచితేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి అనిత పేర్కొన్నారు. పాలీహౌస్, షేడ్ నెట్లలో పెంచితే నాణ్యమైన నారు వస్తుంది. కూరగాయలకు కోకోపీటు మిశ్రమం టన్నుకు కిలో విత్తనాలు విత్తే పది రోజులు ముందు కలిపితే నారు కుళ్లు తెగులు నివారించవచ్చు. కిలో విత్తనశుద్ధికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా 1.5 గ్రా. ఉపయోగించాలి. నారు పెరిగే సమయంలో కుళ్లు తెగులు ఆశించకుండా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

- న్యూస్‌టుడే, దండేపల్లి

చిచ్చర పిడుగులు.. క్రికెట్‌లో వీరులు

● ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక

న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం:



జిల్లా కేంద్రంలోని క్రికెట్ శిక్షణ కేంద్రంలో క్రీడాకారుల సాధన

వ్యక్తిగత క్రీడల్లో రాణించడం.. ఉన్నతస్థాయికి చేరుకోవడం వారి స్వీయ శిక్షణ, సాధనపై ఆధారపడి ఉంటుంది. కానీ గ్రూపుగా తలపడే క్రీడలో చోటు దక్కించుకోవడం అంత సులువేం కాదు. నిత్యం కసరత్తు చేయాలి.. తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలి. మెరుగైన ప్రదర్శనతో సెలక్టర్లను ఆకట్టుకోవాలి. ముఖ్యంగా క్రికెట్ జట్టుకు ఎంపిక అవడమంటే ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. అలాంటి ఈ ఆటలో పదిహేనేళ్లు కూడా నిండని జిల్లాకు చెందిన చిన్నారులు సత్తాచాటుతూ ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో తలపడేందుకు సిద్ధమవుతున్నారు.

బ్యాటింగ్‌లో మెరిసి.. రాష్ట్ర స్థాయికి చేరి



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేములపల్లి లక్ష్మణ్ సాయి బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. కుడిచేతి వాటంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహించిన జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలిసారి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాటు జట్టులో కీలకమయ్యాడు. గురు అకాడమీలో శిక్షణ పొందుతున్న లక్ష్మణ్ ఆయా పోటీల కోసం ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తున్నాడు.

ఎడమ చేతి వాటం.. ఆల్‌రౌండ్ ప్రతిభ



కొంతకాలంగా మంచిర్యాల పట్టణంలోని అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎడ్ల రిషికేష్‌చంద్ర తన ఎడమచేతి వాటం బ్యాటింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. బ్యాటింగ్‌లో చూడచక్కని షాట్లు.. లైన్ అండ్ లెన్త్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. గతేడాది సైతం ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకోగా ఈ ఏడాది మరింత మెరుగైన ప్రదర్శనతో ఉమ్మడి జిల్లా జట్టును విజయతీరాలకు చేర్చాలని సిద్ధమవుతున్నాడు.

తండ్రి శిక్షణ.. మెరుగైన ప్రదర్శన



జిల్లాలోని రామకృష్ణాపూర్ క్రికెట్ జట్టు అంటే బింగి దుర్గాప్రసాద్‌ను గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. తన బ్యాటింగ్‌తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. విశ్వవిద్యాలయ కెప్టెన్‌గా వ్యవహరించి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అతని అడుగుజాడల్లోనే నడుస్తూ కుమారుడు అర్జున్ రాణిస్తున్నాడు. తండ్రి శిక్షణలోనే మెలకువలు నేర్చుకుంటూ మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నాడు. మరోసారి ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో జట్టులో కీలక సభ్యుడు కాగా అందుకు తగ్గట్లుగా ముమ్మర సాధన చేస్తున్నాడు.

బ్యాటింగ్‌లో ధనాధన్.. కీపింగ్‌లో మెరుపు వేగం



ఓపెనర్‌గా వచ్చిరావడంతోనే తనశైలిలో దంచికొట్టడం పులిపాక వికాస్ సొంతం. బౌలర్ ఎవరైనా, బంతి ఎంత వేగంతో వచ్చినా స్టాండ్స్‌లోకి పంపడమే అతనికి తెలుసు. ఆ ఆటతీరుతోనే జిల్లా, జోనల్ స్థాయిలో సత్తాచాటి తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బ్యాటింగ్‌లో రాణించడమే కాకుండా కీపింగ్‌లోనూ జట్టుకు అదనపు బలం చేకూరుస్తున్నాడు.



దుబాయ్ స్టేడియంలో బతుకమ్మ ఉత్సవంలో వివిధ జిల్లాల వాసులు



నృత్యం చేస్తున్న మహిళలు, పిల్లలు



బతుకమ్మ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న డోలు కళాకారులు

ఎడారి నేలపై పూల పండగ

మామడ, మందమర్రి పట్టణం- న్యూస్‌టుడే : ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం(ఈటీసీఏ) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు ఈ కార్యక్రమాన్ని అక్కడి అల్ అహ్లీ ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఏటా నిర్వహించే పూలపండగకు ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. బతుకమ్మ ఉత్సవాలు ఆకట్టుకున్నాయని నిర్మల్‌కు చెందిన రాజు, రాజశేఖర్ తెలిపారు. ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, కళాకారులు, సందడి చేసినట్లు జిల్లావాసులు వివరించారు.

పాత పింఛను హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పాత పింఛను విధానాన్ని తీసుకురావాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. జన్నారంలో సోమవారం సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టోకు అనుకూలంగా జీవోను విడుదల చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన ఝార్ఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పాత ఫించన్ విధానం అమలు చేశారన్నారు. 1.9.2004కు ముందు విడుదలైన ఉద్యోగ ప్రకటన ద్వారా నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయలకు కేంద్ర ప్రభుత్వం ఉత్వర్వులు 57/5 ప్రకారం పాత పింఛన్ విధానం అమలుతో ఇతర రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగులకు మేలు జరిగిందని అన్నారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దసరా పండగ కానుకగా పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన కోరారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

ఆమె చేతుల్లో.. అద్భుత కళా నైపుణ్యం

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలని ఆలోచించారు ఈ అతివలు. కుట్లు, అల్లికలు కాకుండా భిన్నంగా తమకంటూ ప్రత్యేకత చాటుకొనేలా వస్తువుల తయారీ మార్గాన్ని ఎంచుకొన్నారు. గృహాలంకరణకు ఉపయోపడే వివిధ రకాల వస్తువులు, దేవుళ్ల ప్రతిమలు తయారు చేస్తూ అబ్బురపరుస్తున్నారు.

దూదితో వస్తువుల తయారీలో భాగ్యలక్ష్మి

ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి కిరాణ దుకాణం నడిపించే తన భర్త వట్టం వార్ ప్రసాద్‌కు వ్యాపారంలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఖాళీ సమయంలో ఇంట్లో దూదితో అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. దేవుళ్ల ప్రతిమల అలంకరణ కోసం మాలలు, నల్లపూసల గొలుసులు, నెక్లెస్‌లను తయారు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో వినూత్న వస్తువులు తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నానని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.



పాడైన వస్తువులు వినియోగంలోకి తెస్తూ..

ఇంద్రవెల్లి మండలానికి చెందిన శశికళ తన భర్త చంద్రబాన్ ప్రోత్సాహంతో పాడైన వస్తువులతో ఆకర్షణీయమైన గాజులను తయారు చేస్తున్నారు. పాడైన వస్తువులను సేకరించి వాటితో ఆకట్టుకొనేలా గాజులు తయారు చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.




ఆకట్టుకునేలా వస్తువుల అలంకరణలో స్వప్న

ఉట్నూరుకు చెందిన స్వప్న గృహిణి. పండగలు, శుభకార్యాల కోసం పూలు, ఇతర వస్తువులతో ఆకర్షణీయంగా వస్తువులను అలంకరిస్తారు. తన భర్త సునీల్ కుమార్ ప్రోత్సాహంతో వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రుల వేళ దేవుని ప్రతిమలకు సమర్పించే హారతి, లడ్డులు, మహిళలకు వేసే వివిధ రకాల మోహందీ డిజైన్ల అలంకరణ ఆకట్టుకునేలా చేపడుతున్నారు.



ప్రతిమల రూపకల్పనలో నాగమణి

గౌరీ దేవి(గౌరమ్మ), వినాయకుడు, దుర్గాదేవి ఇలా ఏ దేవుళ్ల ప్రతిమ అయినా పసుపు, మైనంతో ఉట్నూరుకు చెందిన నాగమణి తయారు చేస్తున్నారు. భర్త తాటికొండ రమేష్ వ్యాపారస్థుడు. ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూనే నాగమణి గాజు ముక్కలతో ఓం, శివలింగం ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు.





ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రం ఏర్పాటు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఉన్నట్లు సమాచారం వస్తుండటంతో సమస్యను పరిష్కరించటానికి ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో సమస్యలను తెలుసుకోవటానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు తాను జిల్లాలో ఆసుపత్రులను పరిశీలించడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఔషధ నిల్వ కేంద్రాల్లో కొరత ఉన్న మందులను కొనుగోలు చేయటానికి వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇవి జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రిమ్స్‌తో పాటు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్, ఆర్ఎంఓ తొడ్సం చందు, వైద్యులు తిప్పేస్వామి, సందీప్ జాదవ్ తదితరులున్నారు.



రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చందుల స్వామి తెలిపారు. జూనియర్స్ విభాగంలో వివిధ బరువుల్లో (44-46లో) వి.అక్షయ, (50-53లో) పి.అభినయ, (60-63లో) బి.శ్రావణి వెండి పతకాలు, (44-46లో) ఎం.వైష్ణవి, (46-48లో)ఎన్.జ్యోతి, సబ్ జూనియర్ (35-37లో) కె.నందిని కాంస్య పతకాలు సాధించారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సంస్కృతికి మకుటం.. సంబరాల పాఠం

● రెండో తరగతి తెలుగు వాచకంలో 'బతుకమ్మ' పాటలు


న్యూస్‌టుడే, కుంటాల : చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును, సంస్కృతిని నేర్పించాలనే ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. ఈ మేరకు ప్రాథమిక తరగతుల్లోని తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఒక్కో తరగతిలో ఒక్కొక్క సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాటలు, పాఠ్యాంశాలు పొందుపరిచారు. 'జాబిలి-2' పేర రూపొందించిన రెండో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో 'బతుకమ్మ' సంబరాలను అయిదు పాఠ్యాంశాలుగా చేర్చారు. విద్యార్థులు పాటలను నేర్చుకోవడంతోపాటు బతుకమ్మ ప్రాముఖ్యం, సంస్కృతిని వంట పట్టించుకున్నారు. బతుకమ్మను పేర్చేందుకు పూలను కోసుకురావడం నుంచి మొదలుకొని బతుకమ్మను పేర్చడం, బతుకమ్మలెత్తుకొని ఊరి మధ్యలోకి తీసుకెళ్లి పెట్టడం, బతుకమ్మలాడటం, నిమజ్జనం చేసే వరకు వరుస క్రమంలో పాఠ్యాంశాలను పొందుపరిచారు.

✦ తెలుగు వాచకంలో మొదటి పాఠ్యాంశమైన 'రంగురంగుల పూలు'తో బతుకమ్మను పేర్చేందుకు ఉపయోగించే 22 రకాల పూల పేర్లు వచ్చేలా పాటను రూపొందించారు. బతుకమ్మ సంబరంలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా చిన్నారులు, మహిళల అలంకరణను 'ఓణీలు జడకుచ్చులు ఉయ్యాలో, ఒయ్యారమొలకంగ ఉయ్యాలో, బుట్ట బొమ్మలోలే ఉయ్యాలో, బుజ్జిపాపలు కదలి ఉయ్యాలో, అద్దాల రవికలు ఉయ్యాలో, ముత్యాల చీరెలు ఉయ్యాలో, నడుముకూ వడ్డాణం ఉయ్యాలో, నాణ్యమైన నగలు ఉయ్యాలో, నిండైన గాజుల్ల ఉయ్యాలో, బతుకమ్మలెత్తిరి ఉయ్యాలో, నడిచేటి పాదాలు ఉయ్యాలో, నదులను బోలు ఉయ్యాలో.. అంటూ 'బతుకమ్మలెత్తుదాం'లో పేర్కొన్నారు.


✦ 'నిద్దుర పొమ్మంటు చందమామ, జోలపాటలు పాడి చందమామ, పోయిరా గౌరమ్మ చందమామ, మరలింరావే తల్లి చందమామ..' అంటూ సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం గురించి 'పోయిరా గౌరమ్మ'లో పొందుపరిచారు. ఇలా.. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచిన బతుకమ్మ పండుగపై సంపూర్ణ అవగాహనను పెంచుకున్న చిన్నారులు ప్రస్తుతం నిత్యం ఆయా బస్తీల్లోని చిన్నారులు బతుకమ్మలను పెట్టుకుని ఇవే పాటలను చదువుకుంటూ చిందులేసుకుంటూ సంబరంగా ఆడుకుంటున్నారు.



వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రంగురంగుల పూల పాఠం



బతుకమ్మలెత్తుదాం